జడ్జిమెంట్ డే


ఎన్నికల కౌంటింగ్ జరగనున్న బిట్ కళాశాల

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసినప్పటి నుంచి నెలకొన్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది. పోటీ చేసిన అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలందరూ మంగళవారం జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌పైనే దృష్టిసారించారు.

- అందరి చూపు నేడు జరిగే ఎన్నికల కౌంటింగ్ పైనే...
- ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అభ్యర్థులు
- హిందూపురం అసెంబ్లీ బరిలో 13 మంది
- పెనుకొండ బరిలో 9 మంది
- మడకశిర అసెంబ్లీ బరిలో 13 మంది

మడకశిర: మడకశిర అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు మంగళవారం హిందూపురం సమీపంలోని బిట్స్ కళాశాలలో జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్నికల అధికారులు పగడ్బందీగా పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత ఉదయం 8.30 గంటల నుండి ఈవీఎంలలో పోలైన ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా 87.50 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,10,804 ఓట్లు ఉండగా ఇందులో 1,84,358 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,323 ఉన్నాయి. హోం ఓటింగ్ విధానంలో వృద్ధులు, వికలాంగులు 290 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 95 మంది సర్వీస్ ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో 241 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికలను నిర్వహించారు.

బరిలో 13 మంది అభ్యర్థులు

మడకశిర అసెంబ్లీ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానానికి 13 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఈరలక్కప్ప, టీడీపీ అభ్యర్థిగా ఎంఎస్ రాజు, కాంగ్రెస్ అభ్యర్థిగా సుధాకర్, బీఎస్పీ అభ్యర్థిగా ఇందివర్, రాడికల్స్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా హనుమంతరాజు, స్వతంత్ర అభ్యర్థులుగా ధనరాజు, రవీంద్ర, కరినింగప్ప, జగన్నాథప్రసాద్, పవిత్ర, గురుమూర్తి, రాజన్న, లక్ష్మీనరసప్ప పోటీలో ఉన్నారు.

14 టేబుళ్లు...18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపునకు ఎన్నికల అధికారులు 14 టేబుళ్లను సిద్ధం చేశారు. 18 రౌండ్లలో మడకశిర ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి కానుందని ఆర్‌ఓ గౌరిశంకర్‌రావు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు మడకశిర అసెంబ్లీ ఫలితం వెలువడే అవకాశం ఉందన్నారు.

పెనుకొండ: నియోజకవర్గ ప్రజలందరూ సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల, పరిగి, రొద్దం మండలాలు ఉన్నాయి. పెనుకొండ మున్సిపల్ పరిధిలో 91.74 శాతం, రూరల్‌లో 83.70, సోమందేపల్లి 88.93, పరిగి 87.18, సోమందేపల్లి 87.39, గోరంట్ల 84.69 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గ వ్యాప్తంగా చూస్తే 86.96 శాతం ఓటింగ్ జరిగింది. మొత్తం 2,35,986 లక్షల ఓట్లు ఉండగా 2,05,203 ఓట్లు పోలయ్యాయి. అందులో పురుషులు 1,03613 కాగా 1,01,588 మహిళా ఓటర్లు ఉన్నారు. థర్డ్ జెండర్ ఓట్లు 2 ఉన్నాయి.

బరిలో 9 మంది అభ్యర్థులు..

పెనుకొండ అసెంబ్లీకి మొత్తం 9 మంది బరిలో ఉన్నారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ తరఫున మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, టీడీపీ తరఫున ఎస్. సవిత, కాంగ్రెస్ నుంచి నరసింహులు, జై భీంరావ్ పార్టీ నుంచి నాగరాజు, బీఎస్పీ తరఫున ఆదినారాయణ, స్వతంత్రులుగా మహేష్, నరసింహులు, గణేష్‌నాయక్, హబీబ్ బరిలో నిలిచారు. ప్రధాన పోటీ వైఎస్సార్‌సీపీ – టీడీపీ మధ్యనే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఉత్కంఠ రేపుతున్న 'పురం' ఫలితం

హిందూపురం/ హిందూపురం టౌన్: రాష్ట్రంలోనే రాజకీయంగా హిందూపురం నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి హిందూపురంలో ఆ పార్టీనే గెలుస్తూ వస్తోంది. హిందూపురం నుంచి వరుసగా సిట్టింగ్ ఎమ్మెల్యే బాలకృష్ణ మూడోసారి ఎన్నికల బరిలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన టీఎస్ దీపికను బరిలో దించారు. దీంతో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. ఎవరు గెలిచినా 3 నుంచి 5 వేల మెజార్టీతోనే విజయం సాధిస్తారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. హిందూపురంలో వైఎస్సార్‌సీపీ గెలుపుతో కొత్త చరిత్ర సృష్టించిబోతున్నామని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

19 రౌండ్లలో ఫలితం

హిందూపురం నియోజకవర్గ వాప్తంగా మొత్తం 2,49,174 మంది ఓటర్లు ఉండగా 1,93,905 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 97,653 మంది, మహిళలు 96,653 మంది ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,054 పోస్టల్ బ్యాలెట్లు, 219 హోమ్ ఓట్లు, 87 సర్వీసు ఓట్లు ఉన్నాయి. మొత్తం 77.81 శాతం పోలింగ్ నమోదైంది. హిందూపురం మండల పరిధిలోని బిట్ కళాశాలలో హిందూపురం నియోజకవర్గ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. హిందూపురం నియోజకవర్గం ఎన్నికల ఫలితం 19 రౌండ్లలో తేలనుంది. 14 టేబుళ్ల, 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు

హిందూపురం అసెంబ్లీ పరిధిలో 13 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా టీఎస్.దీపిక, టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎం.హెచ్.ఈనాయతుల్లా బరిలో ఉన్నారు. అలాగే బీఎస్పీ తరఫున శ్రీరాములు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి అభ్యర్థిగా కోడూమూరు నౌషాద్, ఎస్‌యూసీఐ అభ్యర్థిగా రవీంద్ర, జైభీంరావ్ భారత్ పార్టీ నుంచి నాగరాజు, సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థిగా షేక్‌షౌకాత్, స్వతంత్ర అభ్యర్థులుగా పరిపూర్ణానందస్వామి, సాయినంది, మొహమ్మద్‌గౌస్, లోకేంద్రనాథ్, మాదన్న పోటీలో ఉన్నారు.

రూ.కోట్లల్లో బెట్టింగ్

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏ పార్టీ విజయం సాధిస్తుంది? అనేది దానిపై రూ.కోట్లల్లో బెట్టింగ్ జరిగినట్లు తెలుస్తోంది. టీడీపీ గెలుస్తుందా? వైఎస్సార్‌సీపీ గెలుస్తుందా? మెజార్టీపై ఇలా పలు రకాలుగా బెట్టింగ్‌లు వేసుకున్నారు. హిందూపురం ఫలితంపై హిందూపురంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ జోరుగా బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. దీంతో అందరి చూపు హిందూపురం ఫలితాలపై నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు హిందూపురంలో ఎవరూ గెలుస్తారో తేలనుంది.

క్లుప్తంగా

సమయ పాలన పాటించాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ

రొళ్ల: మూడేళ్ల పైబడి ఐదేళ్లలోపు వయస్సున్న పిల్లలు సక్రమంగా అంగన్‌వాడీ సెంటర్లకు హాజరయ్యేలా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయం ఆవరణలో దొడ్డేరి, ఎం.రాయాపురం సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లలో పనిచేస్తున్న కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్నమ్మ మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో కార్యకర్తలు సమయ పాలన పాటించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లలో అందించిన పౌష్టిహారం, చిన్నారుల హాజరు శాతం ఇతరాత్ర వాటి పై ఆరా తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

డెంగీ నివారణపై అవగాహన


దోమల నివారణకు మందు స్ప్రే చేయిస్తున్న వైద్య సిబ్బంది

అగళి: మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లీ పంచాయతీలోని వడ్రహట్టి గ్రామంలో సబ్ యూనిట్ అధికారి సమీవుల్లా ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సబ్ యూనిట్ అధికారి సమీవుల్లా తెలియజేశారు. గత సంవత్సరం వడ్రహట్టి గ్రామంలో మలేరియా జ్వరాలు సోకిన సందర్భంగా ఈ సంవత్సరం ముందు జాగ్రత్తగా ప్రతి ఇంట్లో దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేయించడం జరిగిందన్నారు. డాక్టర్లు శివనంద, గాయత్రి , ఈఓఆర్డీ పద్మ, సూపర్‌వైజర్ నరసారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, సుందరయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు దిగితే చర్యలు


ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు

సోమందేపల్లి: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు దిగతే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ విజయ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీలు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజల ఆస్తులకు నష్టం కలిగిస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు


ఓటు వేయడానికి క్యూలో నిలుచున్న ఓటర్లు

పావగడ: స్థానిక ఆగ్నేయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పావగడ సెగ్మెంట్‌లో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసి రెండు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 803 ఓట్లలో 764 ఓట్లు పోలయ్యాయి. 95.14 శాతం పోలింగ్ నమోదు అయిందని ఎన్నికల అధికారి తహసీల్దార్ సంతోష్‌కుమార్ తెలిపారు. మొదటి బూత్‌లో 302 మంది పురుషులు, 84 మంది మహిళలు, రెండో బూత్‌లో 294 మంది పురుషులు, 81 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా ఎన్నికల కేంద్రం వెలుపల కాంగ్రెస్, ఎన్డీఏ కూటమి నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా డీటీ శ్రీనివాస్, కూటమి అభ్యర్థిగా వైఏ నారాయణస్వామి పోటీ చేశారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు

పెనుకొండ: ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాజేష్ హెచ్చరించారు. మంగళవారం ఉదయం నుంచే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో టీ షాపులు, ఇతర దుకాణాలు తెరవకూడదన్నారు. విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం, బాణసంచా కాల్చకూడదని వెల్లడించారు. కౌంటింగ్ నేపథ్యంలో ప్రత్యేక బలగాలు పట్టణానికి చేరుకున్నాయని, షాడో పార్టీని కూడా సిద్ధంగా ఉంచామన్నారు. ప్రజలు ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు.

భవిత కేంద్రం ఉపయుక్తం


చిన్నారి అడ్మిషన్ ఫారం తీసుకుంటున్న ఎంఈఓలు

పరిగి: మానసిక వికలాంగులతో పాటూ అంగవైకల్యం కలిగిన చిన్నారులకు భవిత కేంద్రం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం తెలిపారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సోమవారం కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ వైకల్యం అన్నది కేవలం మనిషికి మాత్రమేనని, అది మనిషి ఎదుగుదలకు అవరోధం కాకూడదన్న విషయాన్ని ప్రపంచంలో ఎంతో మంది మేధావులు నిరూపించారన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయిని మమత, సీఆర్పీ అపర్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా సమయంలో మార్పు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు చేసినట్లు ఏఈ వెంకటేశులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి 12 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకూ 3 ఫేస్ సప్లయ్ ఇస్తామన్నారు. అదేవిధంగా మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 18 గంటల పాటు సింగిల్ ఫేస్ సప్లయ్ ఇస్తామని వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

లేపాక్షి ఆలయంలో ప్రత్యేక పూజలు


అలంకరణలో వీరభద్రస్వామి


దుర్గాదేవి

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం ప్రజలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వీరభద్రస్వామి, దుర్గాదేవి, పాపనాశేశ్వరుడు, రఘునాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.

నృత్య పోటీల్లో 'పురం' వాసుల ప్రతిభ


నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన కళాకారులు

హిందూపురం టౌన్: రామ సేతు ఇండియన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అయోధ్యలో నిర్వహించిన నృత్య ప్రదర్శన పోటీల్లో హిందూపురానికి చెందిన గతిస్వం కూచిపూడి కళాక్షేత్రం కళాకారులు ప్రతిభ కనబరిచారు. వివిధ రాష్ట్రాల నుంచి నృత్య ప్రదర్శనలో కళాకారులు పాల్గొనగా గతిస్వం కళాకారులు 10 నృత్య పోటీల్లో విజేతలుగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు విద్యాధరిని కళావిభూషణ అవార్డుతో సత్కరించారు. అలాగే గతిస్వం కూచిపూడి కళాక్షేత్రం కళాకారిణులు ప్రవల్లిక, మోక్షదా, మోక్షిత, రేఖ, స్కంద, మధురిమ, శ్రేయ, శ్రీకృతి, సమన్విత, గ్రీష్మలను ప్రతిభ కనబరచగా వారికి ప్రశంసాపత్రలను అందజేసి సత్కరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. 10 మంది జూదరులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.32 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టుకు హాజరు పర్చనున్నట్లు పేర్కొన్నారు.

రొళ్లలో 22.2 మి.మీ వర్షం

రొళ్ల: మండల వ్యాప్తంగా 20 రోజులుగా ఈదురుగాలుతో కూడిన ముంగారు వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి 1 గంట వరకూ ఈదురు గాలితో కూడిన వర్షం పడింది. 22.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


అమరాపురంలో పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

అమరాపురం: మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ.జనార్దననాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో మండలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో పికెటింగ్, మొబైల్ టీమ్ తదితర వాటిని ఏర్పాటు చేసి ఎక్కడా శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీసుల ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప


కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశమైన ఈరలక్కప్ప

మడకశిర: ఎన్నికల కౌంటింగ్ వేళ ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప సూచించారు. సోమవారం ఆయన మడకశిరలో కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలా వ్యవహరించాలో వివరించారు. ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని కోరారు. ఏమాత్రం తేడా వచ్చినా నష్టం జరుగుతుందన్నారు. అనుమానం వస్తే వెంటనే అభ్యంతరం తెలపాలని కోరారు. ఈసీ నిబంధనలను ఎవరూ కూడా అతిక్రమించకూడదని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కౌంటింగ్ ప్రారంభం నుండి చివరి వరకూ టేబుళ్ల వద్దే ఉండాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎన్ రవిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో విజయం సాధిస్తా

మడకశిర అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ గెలుపొందడం తథ్యమని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప ధీమా వ్యక్తం చేశారు. ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడుతూ తాను భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ఉపాధి కూలీ అయిన తనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ టికెట్ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గంలోని పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దాదాపు రూ.2,100 కోట్లను డీబీటీ, నాన్ డీబీటీ కింద అందించారని గుర్తు చేశారు. పేదలందరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడ్డారన్నారు. చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో పరాభవం తప్పదని, మరోసారి వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు.

అంగట్లో అంగన్‌వాడీ పాల పౌడి


పాలపౌడి ప్యాకెట్‌ను విక్రయిస్తున్న దుకాణదారుడిని ప్రశ్నిస్తున్న సీడీపీఓ


ప్రభుత్వం సరఫరా చేసిన పాలపౌడి ప్యాకెట్

పావగడ: క్షీర భాగ్యం పథకం కింద బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందించే పాల పౌడిని పలువురు అంగనవాడీ కార్యకర్తలు అక్రమంగా అంగట్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. తాలూకాలోని వైఎస్ హొసకోటలోని ఎంజీ రోడ్డు మొదటి మలుపులో ఉన్న గౌరిశంకర్ దుకాణానికి సోమవారం స్థానిక సీడీపీఓ సునీత వెళ్లారు. సాధారణ కస్టమర్‌లా పాలపౌడి ప్యాకెట్ కొన్నారు. మార్చి నెలలో క్షీర భాగ్య పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన పాల పౌడి ప్యాకెట్ లభించినట్లు సీడీపీఓ తెలిపారు. దీంతో ఆమె వ్యాపారిని విచారించగా కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు పాలపౌడి ప్యాకెట్లు అందిస్తున్నారని, తాము అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీడీపీఓ స్పష్టం చేశారు. పాలపౌడి మాత్రమే కాదని వివిధ సరుకులను కూడా అంగన్‌వాడీ కార్యకర్తలు అమ్మేస్తున్నారని ఆర్టీఐ కార్యకర్తల వేదిక జిల్లా అధ్యక్షుడు లక్ష్మణమూర్తి ఆరోపించారు. స్త్రీ ,శిశు సంక్షేమశాఖ అధికారుల వైఫల్యంతోనే ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయన్నారు.

కొనసాగుతున్న పింఛన్ కష్టాలు



మడకశిర ఎస్‌బీఐ సీఎస్‌పీ సెంటర్ వద్ద పింఛన్ తీసుకోవడానికి గుమిగూడిన పింఛన్‌దారులు

మడకశిరరూరల్: పింఛన్‌దారుల కష్టాలు కొనసాగుతున్నాయి. బ్యాంకుల్లో జమ అయిన పింఛన్ డబ్బులను తీసుకునేందుకు లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. మడకశిర పట్టణంలో ఎస్‌బీఐ సీఎస్‌పీ సెంటర్ వద్దకు సోమవారం పెద్ద ఎత్తున లబ్ధిదారులు తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిలుచుకొని పింఛన్ డబ్బులు తీసుకుంటున్నామని పింఛన్‌దారులు వాపోయారు. గతంలో పైసా ఖర్చు లేకుండా వలంటీర్ల చేతుల నుంచి ఉదయమే ఇంటి వద్దనే పింఛన్‌ను అందుకునేవాళ్లమన్నారు. చంద్రబాబు కుట్రతో రెండు నెలల నుంచి పింఛన్ తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


ఫుట్‌బాల్ ఆడుతున్న చిన్నారులు


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

మడకశిరరూరల్: వేసవి సెలవులను విద్యార్థులు ఎంజాయ్ చేస్తున్నారు. ఉదయం , సాయంత్రం వేళల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ మైదానాల్లో వివిధ రకాల ఆటల పోటీల్లో మునిగితేలుతున్నారు. గ్రామాలు మొదలు పట్టణాల వరకూ మైదానాల్లో క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్‌తో పాటు గ్రామీణ క్రీడలు ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. మడకశిర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో క్రీడాకారులు వివిధ క్రీడ పోటీలు ఆడుతూ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకుంటున్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

చిలమత్తూరు: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈఓ పద్మప్రియ అన్నారు. సోమవారం మండలంలో ఉన్న దివ్యాంగ చిన్నారులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సహిత, విద్య, శమంతకమణి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలోని ఇందిరమ్మ కాలనీ, శిర రోడ్డు, పాత ఎస్సీ కాలనీ తదితర ప్రాంతంలో ఎంఈఓ 1 రాఘవయ్య, ఐఈఆర్టీ వన్నూరస్వామి ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులతో మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకంగా మండల కేంద్రమైన అమరాపురంలో భవిత కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పిల్లలను అక్కడికి పంపిస్తే వారికి ఆట పాటలతో విద్యావంతుల్ని చేస్తామని పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 35 మంది విభిన్న ప్రతిభావంతులను గుర్తించినట్లు ఐఈఆర్టీలు వన్నూరస్వామి, కుసుమలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726